మాటలు లేవు ఇంగ్లీషులో. ఇదివరకు చచ్చిపోయింది మా నానమ్మ. ఇప్పుడు ప్రాణంమీదికి వచ్చింది మా అమ్మమ్మకి."

తెలివిగా సర్దుకున్నాడు వెంకటపతి.

ఫైల్ మూసి, దూరంగా తోశాడు ఫైలుని.

"సెలవుపెట్టి వెళ్ళటం తప్పదా?"

"వెరీ అర్జెంట్, సార్. చచ్చిపోతే మళ్ళీ తిరిగి రాలేదు మా అమ్మమ్మ. ఆఖరి క్షణాల్లోనయినా దగ్గర ఉంటాను" అన్నాడు కంఠంలో వీలయినంతవరకు బాధ ధ్వనించేలాగా.

"మీ వర్క్ చాలా ఉంది పెండింగ్‌లో. మన ఆఫీసులో స్టాఫ్ తక్కువన్న సంగతి మీకు తెలుసు కదా? అయిదు రోజులు ఇస్తున్నాను సెలవు. వీలయితే ఈ లోపలే తిరిగి వచ్చేయండి."

వెంకటపతి ఇచ్చిన లీవ్ లెటర్‌మీద ఎర్రసిరా కలంతో ఏవో వ్రాసి, ట్రేలో పడేశాడు కాగితం.

"థాంక్యూ, సర్" అన్నాడు వెంకటపతి వినయంగా.

"ఆ మెడికల్ షాప్ ఫైలు ఏదో మీ దగ్గిర ఉందిగా? ఈవేళ అది పూర్తిచేసి వెళ్ళండి" అన్నాడు ఆఫీసర్.

"అలాగే."

బయటపడ్డాడు వెంకటపతి, ఊపిరి పీల్చుకుని ఆనందంగా. రాత్రి ఎనిమిది అయింది దాదాపుగా, ఆఫీసర్ చెప్పిన ఫైలు పని పూర్తిచేసే టప్పటికి.

ఆఫీసునుంచి సరాసరి రైల్వేస్టేషన్‌కి వెళ్ళి మర్నాడు విజయవాడకి సీట్లు రిజర్వ్ చేశాడు. తనతో కూడా తెచ్చుకున్న, గవర్నమెంట్ ఆఫీసుల్లో ఉపయోగించే బ్రౌన్‌కలర్ కవర్‌లో టిక్కెట్లు భద్రంగా పెట్టి, కవరు జేబులో పెట్టుకున్నాడు.

ఇంటిపైపు దారితీశాడు వెంకటపతి ఈలవేస్తూ. చెల్లెలికి, పెళ్ళికి ఏం ప్రజంటేషన్ తీసుకువెళ్ళాలా అని ఇద్దరూ కలిసి ఆలోచించారు. కాని,

"ట్రివాన్‌కూర్‌లో పనిచేస్తున్నాడు, ఏదో కంపెనీలో."

"ఎంత ఇస్తున్నారు కట్నం?" అడిగాడు కొంచెం ముందుకి వంగి.

"ఆరువేలు, లాంఛనాలు కాకుండా."

"చవకే" పెదవి విరిచాడు.

వెంకటపతి మనస్సులోనే విసుక్కున్నాడు ఆ ముసలాయన ప్రశ్నల ధోరణికి. పెద్దవాళ్ళెప్పుడూ ఇంతే. మొదటి ప్రశ్నకి సమాధానం యివ్వ కూడదు. ఇస్తే ఒకదాని వెంట మరొకటిగా వస్తాయి చాలా.

"అమ్మాయి ఏం చదివింది?" అడిగాడు కాస్సేపాగి.

"ఎస్. ఎస్. ఎల్. సి. పాసయింది. కాలేజీ చదువులు లేవు. మా ఇంట్లో ఏ ఆడపిల్లకీ, రైపు, కుట్టు, సంగీతం వచ్చు" అన్నది కొంచెం గర్వంగా.

"లక్షణంగా ఉంది."

మెచ్చుకున్నాడు ఆయన.

రైలు అప్పుడే రెండు స్టేషన్‌లు దాటింది. వెంకటపతి కొడుకు రైలు కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు, కలుసుకుని విడిపోతున్న టెలి గ్రాఫ్ తీగలవంక.

"ప్రజంటేషన్ ఏం ఇస్తే బాగుంటుంది మా చెల్లెలికి? మీరు చాలా పెళ్ళిళ్ళు చూసి ఉంటారు. అనుభవం కలవారు. మాకు ఏం కొనాలో తెలియ లేదు."

అడిగింది వెంకటపతి భార్య ఆ ముసలాయనని. గొంతు సద్దు కున్నాడు ముసలాయన.

"స్టెయిన్‌లెస్ స్టీల్ సామాను కొని ఇస్తే ఉపయోగపడుతుంది చాలా కాలం. ఖరీదయిన పెన్నూ, కాఫీ సెట్టు లాంటివి ఇవ్వకండి. వాటి వాడకం మన ఇళ్ళలో తక్కువ. ఒక తులం బంగారు ఉంగరం చేయించి ఇచ్చినా ఫర్వాలేదు. అవి అమ్ముకుంటే, కష్టకాలంలో డబ్బయినా వస్తుంది. మిగ

